ప్రజాశక్తి
శుక్రవారం 25 ఆగస్టు 2023
8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

ఫ్లెక్సీల రగడ

రంగన్నగూడెంలో ఫ్లెక్సీలను చించివేస్తున్న వైసిపి నేతలు

- రణరంగంగా రంగన్నగూడెం
- యువగళం పాదయాత్ర నేపథ్యంలో టిడిపి, వైసిపి ఘర్షణ
- వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇరుగ్రూపుల ఫిర్యాదు

రంగన్నగూడెంలో టిడిపి, వైసిపి నేతల ఘర్షణ

వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో టిడిపి, వైసిపి బల ప్రదర్శన

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్)

ఫ్లెక్సీల రగడతో రంగన్నగూడెం రణరంగంగా మారింది. ఫ్లెక్సీల చించివేతతో టిడిపి, వైసిపి నేతల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 193వ రోజు బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాగింది. రంగన్నగూడెం గ్రామంలో లోకేష్‌కు స్వాగతం పలుకుతూ ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, కొడాలి నాని ఫొటోలతో పాటు లోకేష్ ఫొటో, జగన్ అందించిన సంక్షేమ పథకాలు తెలియజేస్తూ ఫ్లెక్సీని వైసిపి నేత ఏర్పాటు చేశారు. దీనిని అడ్డుకునేందుకు టిడిపి నేతలు ప్రయత్నించగా వైసిపి నేతల దుర్భాషలాడటంతో సహనం కోల్పోయిన టిడిపి మద్దతుదారులు ఫ్లెక్సీ చింపివేసారు. దీంతో ఇరుగ్రూపుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలకు నచ్చజెప్పి ఘర్షణను సర్దుబాటు చేశారు. అనంతరం లోకేష్ పాదయాత్ర యధావిధిగానే కొనసాగింది. విషయం తెలుసుకున్న గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ క్షణాల్లో అక్కడికి చేరుకున్నారు. వంశీ గ్రామంలో ఉండగానే లోకేష్ పాదయాత్రకు స్వాగతం పలుకుతూ టిడిపి (మిగతా 6లో)

మల్లవల్లికి పూర్వ వైభవం తెస్తాం

యువగళం పాదయాత్రలో లోకేష్ 6లో కృష్ణాజిల్లాలో ముగిసిన యాత్ర

అగ్నికి ఆహుతి

300 టివిఎస్ వాహనాలు దగ్ధం

వార్త మెయిన్‌లో

విజయవాడ స్టెల్లా కాలేజీ సమీపంలోని కాసా టివిఎస్ వాహనాల షోరూమ్‌లో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో షోరూమ్‌లో ఉన్న సుమారు 300 వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి.

విజయవాడలో భారీ వర్షం

ప్రజాశక్తి-విజయవాడ

గురువారం సాయంత్రం విజయవాడ నగరంలో భారీ వర్షం కురిసింది. సాయంత్రం 5.20 నుంచి 6 గంటల వరకు మొదలైన వర్షం రాత్రి 8 గంటల వరకు కురుస్తూనే ఉంది. దీంతో నగరం కొంత జలమయం అయింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. వన్‌టౌన్‌లోని హెచ్‌బి కాలనీ, చిట్టినగర్, పాలఫ్యాక్టరీ, కబేళా, నైజాంగేటు, కాళేశ్వరరావు మార్కెట్, టుటౌన్‌లోని బిగ్‌బజార్, రూట్ నెంబర్ 5, మ్యూజియం రోడ్డు, బీసెంట్ రోడ్డు, కోర్టు ఎదురు రోడ్డు, రెడ్ సర్కిల్, తూర్పులోని పాలీక్లీనిక్ రోడ్డు, లయోలా కళాశాల, రైతు బజార్, ఆటోనగర్, గురునానక్‌కాలనీ, అయ్యప్పనగర్, రామలింగేశ్వర్‌నగర్, ఆర్టీసి కాలనీ, ఎలక్ట్రిసిటీ కాలనీ, కృష్ణలంక తదితర ఏరియాల్లో వర్షపునీరు రోడ్ల వెంట నిలిచిపోయి, రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. ఆధ్వాన్నంగా తయారయిన డ్రైన్లు, ఆగిపోయిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీమ్ కారణంగా డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు, వర్షపు నీరు (మిగతా 6లో)

నందిగామలో మెగా జాబ్ మేళా

172 మందికి ఉద్యోగావకాశం

ప్రజాశక్తి-నందిగామ: నిరుద్యోగ యువత ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని కె.వి.ఆర్ కళాశాలలో స్కిల్ ఏపీ అండ్ ఏపీఎస్ఎస్‌డిసి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాను నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్‌మోహన్‌రావు, శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ముందుగా చంద్రయాన్ -3 విజయవంతం అవడంతో ప్రత్యేకంగా కేక్ కట్ చేసి ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందిగామ ప్రాంత విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన పోలీసు ఉద్యోగాలకు సైతం ఎంఎల్ఎ సహకారంతో సొంత ఖర్చుతో ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి 300 మందికి పైగా ఉచిత కోచింగ్ ఇచ్చామని (మిగతా 6లో)

సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ మొండితోక జగన్‌మోహన్‌రావు

లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు డిల్లీరావు, రాజాబాబు

అర్హులందరికీ లబ్ది చేకూర్చేందుకే నవతర్నాలు

ద్వైవార్షిక మంజూరు కార్యక్రమంలో కలెక్టర్లు డిల్లీరావు, రాజాబాబు

ప్రజాశక్తి-విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా)

అర్హులందరికీ నూరు శాతం ప్రభుత్వ పథకాల లబ్ది చేకూర్చడమే నవరత్నాలు ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమం లక్ష్యమని ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు ఎస్.డిల్లీరావు, పి.రాజాబాబు అన్నారు. నవరత్నాలు ద్వారా అర్హులై ఉండి నగదు జమకాని లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లోకి గురువారం సిఎం జగన్ తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులతో కలిసి ఆయా కలెక్టరేట్లలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం లబ్దిదారులకు కలెక్టర్లు చెక్కులను అందజేశారు. విజయవాడలో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి ఈ ద్వైవార్షికంలో ఎన్‌టిఆర్ జిల్లాలో 10,259 లబ్దిదారులకు 12 కోట్ల 91 లక్షల 59 వేల లబ్ది చేకూర్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు మల్లాది విష్ణువర్ధన్, వెలంపల్లి శ్రీనివాసరావు, రక్షణనిధి మాట్లాడుతూ సోషల్ ఆడిట్ నిర్వహించి లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించి మరీ పథకాలు మంజూరు చేయడం పారదర్శకతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్లు బండి పుణ్యశీల, గీతాంజలీ దేవి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజా రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఆధార్‌తో బ్యాంకు ఖాతా అనుసంధానం కాకపోవడం, సకాలంలో ధృవపత్రం సమర్పించకపోవడం తదితర కారణాలతో ప్రభుత్వ పథకాల లబ్ది అందని వారిని మరలా పరిశీలించి అర్హత మేరకు ఏడాదికి రెండు సార్లు లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో మొత్తం 4,272 మంది లబ్ధిదారులకు రూ.6.68 కోట్లు వివిధ పథకాల కింద ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, డీఈవో తహెరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

వెల్వడం పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

వాడుక భాషపై సదస్సు

ప్రజాశక్తి మైలవరం : స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాష వారోత్సవాల్లో భాగంగా గురువారం వాడుక భాష నాడు నేడు రేపు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఇళ్లరవి మాట్లాడుతూ భాష దాని భావం చాలా గొప్పదన్నారు. భాష తలుపు తెరిస్తే విస్తారమైన భావ సంపద మన సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామిత్ర సర్వేపై సమీక్ష

ప్రజాశక్తి - గంపలగూడెం : మండల కేంద్రమైన గంపలగూడెంతో పాటు పలు గ్రామాల్లో కొనసాగుతున్న స్వామిత్ర సర్వేపై మండల స్థాయి అధికారులు గురువారం సమీక్ష నిర్వహించారు. స్థానిక సచివాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో సర్వేపై ఆరా తీసి పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.బాలకష్ణ రెడ్డి, ఎంపిడిఒ వైపి రెడ్డి, ఇఒ గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సచివాల అధికారులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామ ఆయుర్వేద వైద్యశాల ఇన్‌ఛార్జి వైద్యురాలు ఎన్.కవిత, యోగా శిక్షకురాలు అశ్విని గ్రామ ఎస్‌టి కాలనీలో గురువారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 80 మందిని పరీక్షించి, దీర్ఘకాలిక రోగములు, నొప్పులు, జలుబు, చర్మవ్యాధులకు మందులు పంపిణీ చేశారు. ప్రతి 2వ, 4వ గురు వారాల్లో ఎస్‌టి కాలనీలో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సచివాలయాల తనిఖీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ పరిధిలోని 1, 13, 14 సచివాలయాల్లో మున్సిపల్ కమిషనర్ సిహెచ్. మల్లేశ్వర రావు గురువారం తనిఖీలు నిర్వహించారు. సచివాలయ రికార్డులను పరిశీలించి అమ్మఒడి, చేయూత మొదలగు పథకాల ఇకెవైసిలను పరిశీలించారు. విఆర్‌ఒ పరిధిలో ఉన్న ఆదాయ, కులధవీకరణ మొదలగు సర్వీస్‌లు ఆలస్యం కాకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు పూర్తి చేసిన సర్వే ఓటర్ల జాబితా ఫారాలను కూడా పరిశీలించారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం ఆగస్టు 25 లోగా సర్వే పూర్తి చేసిన వివరాలు అన్నీ ఆన్లైన్ చేయాలని బిఎల్‌ఒలను ఆదేశించారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న మల్లేశ్వరరావు

కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : కళ్ళజోళ్ల పంపిణీ, మండలం లోని కన్నెవేడు గ్రామంలో ఉపఆరోగ్య కేంద్రంలో కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్ర మం నిర్వహిం చారు. వయో వృద్ధులకు రెటీనా కంటి పరీక్ష చేసి వారికి అవసరమైన కళ్ళజోలును అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 20 మందికి పైగా కళ్ళజోడులును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం అది మల్ల జ్ఞానమ్మ, ఆశ వర్కర్లు చెంగపొంగు విమలమ్మ, నాగమణి, కొత్తపల్లి సుశీల, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో నేటి నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు నేత్రదాన ప్రచార పక్షోత్సవం నిర్వహిస్తునట్లు స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సమరం తెలిపారు. గురువారం బెంజ్ సర్కిల్ వద్ద గల గోరా ఐ బ్యాంక్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమరం మాట్లాడుతూ భారత ప్రభుత్వం, ఐ బ్యాంక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ పక్షోత్సవాలు నిర్వహిస్తాయన్నారు. స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ గత 28 సంవత్సరాలుగా పక్షోత్సవాలను నిర్వహిస్తోందని, స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ద్వారా ఇంతవరకు రెండు కళ్ళ అంధత్వం ఉన్న 892 మంది చూపు పొందారని అన్నారు. భారతదేశంలో నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్నవాళ్ళు 10 లక్షల మంది ఉన్నారని, అందులో ఒక లక్ష 20వేల మంది, చనిపోయిన వారి కళ్ళని దానం చేయగా చూపు పొందగలరని చెప్పారు. ఏటా మన దేశంలో కోటి మంది మరణిస్తున్నా కేవలం 32వేల మందే తమ మరణాంతరం నేత్రదానం చేస్తున్నారని అన్నారు. మన దేశంలో ఏటా 25వేల కార్నియా గ్రాఫ్టింగ్ ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ పక్షోత్సవాల ప్రారంభ సభ ఈ నెల 25వ తేదీన నాస్తికకేంద్రంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పక్షోత్సవాల సందర్భంగా నేత్రదానంపై వివిధ ప్రాంతాల్లోనూ, సోషల్ మీడియాలోనూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, హైస్కూల్, కాలేజి విద్యార్థులకు నేత్రదానంపై వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం, పాటల పోటీలు, క్విజ్, స్లోగన్ పోటీలు, అంధ విద్యార్థులకు ఆటల పోటీలను ఈ 15 రోజులూ నిర్వహిస్తున్నామని చెప్పారు. సెప్టెంబరు 8న జరిగే ముగింపు కార్యక్రమంలో, వివిధ పోటీలలోని విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని, ఈ వివరాలను పత్రికాముఖంగా, స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ వెబ్‌సైట్‌లోనూ ప్రతిరోజూ తెలియచేయడం ఉంటుందన్నారు. ఇంకా వివరాలకు 9704020303కు ఫోన్ చేయాల్సిందిగా కోరారు. విలేకరుల సమావేశంలో వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డా. బి.కీర్తి, కార్యదర్శి రశ్మి, మెడికల్ డైరెక్టర్ డా. పి.దీక్ష, డా. మారు, కూడా పాల్గొన్నారు.

పక్షోత్సవాల వివరాలు తెలుపుతున్న సమరం, తదితరులు

జుజ్జూరులో ప్రభుత్వ కార్యాలయ ఏర్పాటుకు శ్రీకారం

ప్రజాశక్తి - వీరులపాడు : వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్పుచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ 25న శుక్రవారం, ఉదయం 11.04 గంటలకు మార్పు చేయాలని నిర్ణయించారు. జుజ్జూరు కమ్యూనిటీ హాల్లో మండల తహశీల్దార్ వారి కార్యాలయం, మండల అభివద్ధి అధికారి కార్యాలయాల పనులు ప్రారంభించేందుకు స్థానిక శాసనసభ్యులు మొండితోక జగన్మోహన్‌రావు, శాసనమండలి సభ్యులు ఆరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో మండల ప్రజలు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొనాలని కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఛారిటబుల్ ట్రస్ట్, చైర్మన్ మేడికొండూరు రవికుమార్ నూతన మండల కార్యాలయం ప్రారంభించడానికి ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

ఆహ్వానం : వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరు మండల కేంద్రంగా మారుస్తూ జుజ్జూరు గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అధికారులకు గ్రామ శివారులో ఘన స్వాగతం పలుకుతున్న నేపథ్యంలో పార్టీలకతీతంగా ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ డిల్లీ రావు, శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శాసన మండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్‌లు హాజరవుతున్నారు. మండల పరిధిలోని అన్ని అన్ని రాజకీయ పార్టీలు నాయకులు, పాత్రికేయ మిత్రులు జడ్పిటిసి, సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, పార్టీలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులు వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గహసారథులు, హాజరు కావాలని కోరుతున్నాము.

కామసానికి టిడిపి నేత గన్నె ప్రసాద్ పరామర్శ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం అంబారుపేట గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కామసాని శ్రీనివాస్ అనారోగ్యంగా ఉండటంతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ (అన్నా) పరామర్శ చేశారు. శ్రీనివాస్ అనారోగ్యంగా ఉన్నారని సమాచారం ఉండటంతో అన్నా తన అనుచరులతో అంబర్‌పేటకు ప్రత్యేకంగా వచ్చి పరామర్శించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

కిట్లు అందచేస్తున్న తిరుపతి అనూష

జనసేన సభ్యత్వ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జనసేన 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష అన్నారు. గురువారం హెచ్‌బి కాలనీలో జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న వారి ఇంటింటికి వెళ్లి సభ్యత్వంకిట్లు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న వారిని పార్టీకి మరింత సేవలు చేయాలని, పార్టీ సిద్ధాంతాలను, పవన్‌కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లేలా కషిచేయా లని విజ్ఞప్తి చేశారు. పవన్‌కల్యాణ్ సిఎం కావాలని రాష్ట్ర ప్రజలు ఆకాంక్షిస్తు న్నారని అన్నారు. నిస్వార్థ నాయకు డైన పవన్‌కల్యాణ్ సేవలు రాష్ట్రానికి అవసర మన్న అభిప్రాయాలు ప్రజానీకంలో వున్నా యని అన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేనను గెలిపించాలని, పవన్‌కల్యాణ్‌ను ముఖ్య మంత్రిని చేయాలని ప్రజలకు ఆమె విజ్ఞప్తిచేసారు.

గ్రామీణ విత్తనోత్పత్తిపై శిక్షణ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలంలోని కోకిలంపాడులో గురువారం జిల్లా శిక్షణా కేంద్రం విజయవాడ ఉప సంచాలకులు డి.మాధవీలత ఆధ్వర్యంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు స్వంతంగా నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేసుకోవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఎంటియు 1061 వరి విత్తనోత్పత్తి 25 ఎకరాలలో అమలులో ఉందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని గ్రామీణ స్థాయిలో పండించిన ఈ విత్తనాలు ఆ గ్రామంలోని రైతులంతా తరువాత సీజన్‌లో విత్తనంగా ఉపయోగించుకోవాలని కోరారు. వెదజల్లే వరిలో నీటి, కలుపు, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు.

పైన పటారం... లోన లొటారం...

ప్రజాశక్తి - వత్సవాయి : పైన పటారం లోన లొటారం అన్నట్లుంది మండలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన నర్సరీల సంగతి. పైకి చూపించేది ఒకటి విత్తనం... లోపల ఉండేది మాత్రం నాశిరకం విత్తనం. ఇలా మోసం చేస్తూ కొనసాగించే నర్సరీలకు అనుమతులు, రిజిస్ట్రేషన్‌లు, లైసెన్స్‌లు మాటంటే అంతే సంగతులు. ఇప్పటికి మండలంలో 51 నర్సరీలు దర్శనమిస్తున్నాయి. ఈ నర్సరీలు ప్రభుత్వం చేత గుర్తింపు పత్రాలు, రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని చట్టాలు ఉన్న వాటిని అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారని స్థానిక రైతులు అంటున్నారు.

ఈ నర్సరీల్లో కొనుగోలు చేసిన విత్తనాల వల్ల రైతులకు ప్రయోజనం మాటేమో గానీ నష్టం మాత్రం చవిచూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నర్సరీ రిజిస్ట్రేషన్, లైసెన్సు తప్పనిసరి ఉండాలని అలాంటి వారు మాత్రమే ప్రభుత్వ హార్టికల్చర్ అధికారుల ఆదేశాల మేరకు విత్తనాలు కొనుగోలు చేసి ఆ మొక్కలనే రైతులకు అమ్మాలని అధికారులు చెబుతున్నారు. అలా కొనుగోలు చేసిన విత్తనాల వల్ల రైతులకు పంట దిగుబడి రాకపోయినా నష్టం వాటిల్లినా నర్సరీ వారు ప్రభుత్వంతో అనుసంధానమై పంటల బీమా ఏర్పాటు చేసుకుని నష్టపోయిన రైతులకు పంటల బీమా వర్తింపచేయాలని ఆదేశాలు ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. అయితే నర్సరీలపై ప్రభుత్వ ఆంక్షలు నామమాత్రంగా ఉండటం వల్ల ఇదే అదునుగా భావించిన నర్సరీ యాజమాన్యాలు రైతులను నట్టేట ముంచుతున్నారని కొందరు విమర్శిస్తున్నారు. లైసెన్సులు తీసుకొని అధికారుల నుండి నాణ్యత ప్రమాణాలతో కూడిన ఒక ప్యాకెట్‌ని కొనుగోలు చేసి అవే మొక్కలను అమ్ముతున్నామని నమ్మించి ఒక ప్యాకెట్ నాణ్యమైనదైతే పది ప్యాకెట్లు నాసిరకం వాటిని వాడిరైతుల వద్ద దండుకుంటున్నారు. ప్రస్తుతం మిర్చినారు గిరాకీ ఉండడంతో మొక్క సుమారు రెండు రూపాయల వరకు ధర పలుకుతుంది. గతంలో పోల్చుకుంటే మిర్చినారుకు మంచి లాభాలు వస్తాయి అని ఆశిస్తే తెగులుపట్టి వైరస్ సోకి దుఃఖమే మిగిలింది.

అడ్డగోలుగా మిరపమట్లు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బయట మిరపమట్లను ఏర్పాట్లు చేసుకొనే క్రయవిక్రయాలు చేసినట్లయితే చట్టరీత్యా నేరమని చెబుతున్నారే కానీ అవి అమలులో లేకపోవడం వలన దళారులు ఎటువంటి నాణ్యత ప్రమాణాలు లేని విత్తనాలు వేసి మొక్కలను అమ్ముకొని దండుగా రైతన్నలను పిండుతున్నారు. మండలంలో 51 నర్సరీలకు అనుమతులు ఉన్నాయని అధికారులు అంటున్నారు. బయట వేసిన మిరప నారుకు సంబంధిత అధికారులు మాత్రం నామమాత్రంగా నోటీసులు జారీ చేసి చోద్యం చూస్తున్నారు తప్ప ఆ మొక్కలు అమ్మకాలు జరపకుండా చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే నష్టపోయేది రైతులేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై కఠిన చర్యలు: ఎస్‌పి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : బహిరంగ ప్రదేశాలలో ధూమపానం, పాఠశాలలు, కళాశాలలు సమీపంలో పొగాకు ఉత్పత్తులు, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ పి జాషువా హెచ్చరించారు. కాట్పా చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో (ఎన్టిసిపి) భాగంగా స్థానిక పోలీసు కార్యాలయంలో గురువారం సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల చట్టం కాట్పాని ప్రభావవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రజా ఆరోగ్యశాఖ, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో జిల్లా పోలీసు అధికారులకు సమగ్ర శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జువైనల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 77 ప్రకారం మత్తు కలిగించే పదార్థాలు, మద్యం, పొగాకు ఉత్పత్తులు, సైకోట్రోపిక్ పదార్థాన్ని కలిగిన ఉత్పత్తులను తగిన అర్హత కలిగిన వైద్యుల ఆదేశానుసారం మాత్రమే ఇవ్వాలని, ఇతర ఏ సందర్భాల్లోనైనా పిల్లలకు ఇచ్చినా, ఇవ్వడానికి కారణమైనా ఏడేళ్ళ కఠిన కారాగార శిక్ష, రూ లక్ష జరిమానా విధించబడుతుందని చెప్పారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నో స్మోకింగ్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్విడి ప్రసాద్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్లు మాట్లాడుతూ పొగాకు సంబంధిత వ్యాధుల కారణంగా మన రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 48 వేల మరణాలు సంభవిస్తున్నా యని తెలిపారు. కాట్పా చట్టంలోని సెక్షన్ 6 (బి) ప్రకారం విద్యా సంస్థలకి 100 యార్డులు (300 ఫీట్ల) పరిధిలో పొగాకు విక్రయించడం నిషేధం అన్నారు. వాయిస్ ఆఫ్ టొబాకో వీక్టీమ్స్ (విఓటివి) పాట్రన్ పొగాకు వాడకం వల్ల కలిగే తీవ్ర పరిణామాలపై మాట్లాడుతూ అన్ని రకాల క్యాన్సర్లలో 40 శాతం పొగాకు వల్లనే వస్తుందని, 90 శాతం నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు నేరుగా పొగాకు ఉత్పత్తుల వాడకంతోనే వస్తున్నాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్టిసిపి) డా. ఇ ప్రశాంత్, జిల్లా పోలీసు అధికారులు, రాష్ట్ర, జిల్లా స్థాయి వైద్యశాఖ అధికారులు, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి జాషువా

నీటికుంటలో పడి బాలుడి మృతి

ప్రజాశక్తి-పమిడిముక్కల : రెండు సంవత్సరాల బాలుడు నీటికుంటలో పడి మృతిచెందిన సంఘటన పమిడిముక్కల మండలం లోని కపిలేశ్వర పురంలో బుధ వారం జరిగింది. గ్రామానికి చెందిన పేకేటి సోమేశ్వరరావు, అనూషలకు చెందిన రెండు సంవత్సరాల కుమారుడు కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, గ్రామస్తులు వెతకగా ఇంటికి ఎదురుగా ఉన్న నీటి కుంటలో బాలుడి మృతదేహం లభ్యమైంది. అనూష నీళ్లకెళ్లిన సమయంలో బాలుడు ఆడుకుంటూ వెళ్లి నీటికుంటలో పడి ఉంటారని పలువురు అంటున్నారు. బాలుడు మృతిచెందిన విషయం తెలుసుకున్న పామర్రు ఎంఎల్ఎ కైలే అనిల్‌కుమార్ ఆసుపత్రి వద్ద బాలుడి మృతదేహానికి నివాళులర్పించారు. బాలుడి నీటికుంటలో తానే పడ్డాడా లేదా మరేదైనా కోణం ఉందా అని కేసును వేగవంతంగా దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా బాలుడి కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందించారు. డిఎస్‌పి శ్రీకాంత్, గుడివాడ సిఐ తులసీధర్‌రావు, పమిడిముక్కల సిఐ చలపతిరావు, పమిడిముక్కల ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన టెక్నాలజీతో ఆసుపత్రి నెలకొల్పడం అభినందనీయం : కొడాలి

ప్రజాశక్తి - గుడివాడ : నేటి సమాజంలో కొత్త టెక్నాలజీతో పుట్టిన గడ్డపైనే ప్రజలకు వైద్యం అందిచేందుకు, తండ్రి పేరును నిలబెట్టేందుకు నూతన ఆసుపత్రిని ప్రారంభించిన ప్రముఖ వైద్యులు పెరుమాళ్ళు సందీప్ అభినందనీయుడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), వైద్యులు ఎల్.ఎన్‌రాజులు అన్నారు. గురువారం స్థానిక గౌరీశంకరపురంలోని సాయి శ్రీయాన్ కిడ్నీ అండ్ స్కిన్‌కేర్ సెంటర్ ఆసుపత్రిని బెంగుళూరు బ్లూబ్లిస్ ఆసుపత్రి చైర్మన్, మెడికల్ కాళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.ఎన్ రాజు, విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణలతో కలసి ఎమ్మెల్యే కొడాలి నాని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ప్రజలకు అధునాతన వైద్యం కోసం ఇతర ప్రాతాలకు వెళ్ళి చూపించుకోవడం ఎంతో కష్టతరం అవుతున్న రోజుల్లో ఉన్నత చదువులు చదివి ఇతర దేశాలలో స్థిరపడకుండా ప్రముఖ వైద్యులు పెరుమాళ్ళు కేశవరావు కుమారుడు గుడివాడలో అధునాతన ఆసుపత్రిని నెలకొల్పడం అభినందనీయమన్నారు. ప్రజలకు మంచి వైద్యం అందించి వారి మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యాక్రమంలో ఐఎంఏ గుడివాడ శాఖ అధ్యక్షులు పాలడుగు వెంకట్రావు, కార్యదర్శి పిన్నమనేని శ్రీరామకృష్ణప్రసాద్, వైద్యులు మాంగటి శ్రీనివాస్, పెరుమాళ్ళు సుగుణ, శ్రీభవ్య పాల్గొన్నారు.

షాహిద్ రాజ్ గురుకు ఘన నివాళి

ప్రజాశక్తి - గుడివాడ : నేటి స్వాతంత్ర్య సమరయోధుడు, తెల్ల దొరల అన్యాయాన్ని ఎదిరించిన వ్యక్తి షాహిద్ రాజ్ గురు అని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)కష్ణా జిల్లా కమిటీ సభ్యుడు గుడివాడ పట్టణ కార్యదర్శి ఎస్. సమీర్ అన్నారు. గురువారం షాహిద్ రాజ్ గురు 115వ జయంతిని పురస్కరించుకుని గుడివాడ పట్టణంలో ఉన్నటువంటి రిషి కాలేజ్, ఏజీకే ప్రభుత్వ పాఠశాలలో ఆయన యొక్క జీవిత విశేషాలను సెమినార్ రూపంలో విద్యార్థులకు చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా సమీర్ మాట్లాడుతూ రాజ్ గురు భారతదేశ ప్రజలను సొంత బిడ్డల్లాగా చూసుకున్నటువంటి వ్యక్తి అని ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు చెప్పారు. ఆయన చేసిన త్యాగ ఫలితాలే నేడు మనం స్వాతంత్ర్యం రూపంలో ఊపిరి పీల్చుకున్నా మన్నారు. విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటించాలని ఆయన తెలిపారు. అలాగే భగత్ సింగ్, రాజ్ గురు, సుకదేవ్ లు చేసిన త్యాగ ఫలితమే మన దేశానికి చరిత్ర తెచ్చి పెట్టిందన్నారు. విద్యార్థులకు ఎటువంటి అన్యాయం జరిగిందని అని తెలిస్తే సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజు, శ్యామ్, సుందర్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్‌గురు జీవిత విశేషాలను వివరిస్తున్న సమీర్

విద్యుదాఘాతంతో బాలుడి దుర్మరణం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : విద్యుత్ షాక్‌తో ఓ విద్యార్థి మతి చెందిన సంఘటన మండలంలోని చింతలగుంట ఎంపీపీ స్కూల్ వద్ద చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం లంకా కార్తీక్ (7) చింతలగుంట ఎంపీపీ స్కూల్లో రెండవ తరగతి చదువుతున్నాడు. గురువారం యధావిధిగా స్కూల్ కి వెళ్ళాడు. స్కూల్ నూతన భవనం నిర్మాణం జరుగుతుండడంతో ప్రక్కన తాటాకు ఇంట్లో స్కూలు నడుపుతున్నారు. ఎదురుగా ఉన్న విద్యుత్ మోటారు పంపు ఉన్నాయి. కార్తీక్ ఆ పంపు వద్దకు వెళ్లి నీళ్లు పట్టుకునేందుకు ప్రయత్నించగా విద్యుత్ ప్రవహించి బాలుడు అక్కడికక్కడే మతి చెందాడు. సంఘటన స్థలానికి ఎంపీడీవో దారపు శ్రీనివాస్, గుడివాడ డివైఈవో, ఎంఈఓ 2 జి గోపాల్ రావు, కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పరిశీలించారు. దీనిపై అధికారులు బాలుడికి ప్రభుత్వం నుండి రావలసిన సహాయాన్ని అందేవిధంగా ప్రయత్నిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుని నిర్లక్ష్యం వల్ల ఈ సంఘటన జరిగినట్లు బంధువుల ఆరోపిస్తున్నారు.

మృతిచెందిన బాలుడు కార్తీక్

గొర్రెకోడు డ్రెయిన్ పరిశీలన

డ్రెయిన్ పరిశీలిస్తున్న బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-చల్లపల్లి : మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామ పరిధిలో గుఱ్ఱపుడెక్కతో నిండిపోయిన గొర్రెకోడును మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి గొర్రెకోడును పరిశీలించిన బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో డ్రైనేజి వ్యవస్థ అధ్వాన్నంగా తయారైందని, డ్రైనేజి లలో పూడిక తీతలు, గుఱ్ఱపు డెక్క తొలగించకుండా వదిలివేయడంతో ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకే పొలాలు డ్రైనేజీలు పొంగి ముంపుకి గురయ్యాయని అన్నారు. డ్రైనేజి పనులు అధికార పార్టీ నాయకుల అనునయులకు ఇవ్వడం వలన అధికారులు సైతం వారితో పనులు సకాలంలో చేయించలేకపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి మండల అధ్యక్షులు నడకుదిటి జనార్ధనరావు, పెదప్రోలు గ్రామ సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు, రావి రత్నగిరి, నాదెళ్ల శరత్ చంద్ర, బాలకొటేశ్వరరావు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

హిజ్రాల సమస్యలను పరిష్కరిస్తాం : జెసి

ప్రజాశక్తి - గుడివాడ : జిల్లా జాయింట్ కలెక్టర్ అపారాజితసింగ్ గురువారం మందపాడు కొత్త కాలనీలో నివాసముంటున్న హిజ్రాల సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ హిజ్రాల సమస్యలను తెలుసుకొని వారికి అవసరమైన పరిష్కారాలను వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వి.మురళీకష్ణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు సిబంది పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీలు

అవనిగడ్డలో...

గన్నవరంలో...

ప్రజాశక్తి-అవనిగడ్డ : చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో అందుకు కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తల ఘనతను కీర్తిస్తూ అవనిగడ్డలో విద్యార్థులు, ఎమ్మెల్యే, పోలీసులు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి విజయోత్సవ ర్యాలీ గురువారం ఉదయం నిర్వహించారు. అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులతో ర్యాలీని ఎమ్మెల్యే రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా భారీ జాతీయ పతాకాలను విద్యార్థులు చేత బోని పుర వీధులలో ప్రదర్శన నిర్వహించారు. జయహో భారత్ జయహో ఇస్రో అంటూ చేసిన నినాదాలు అవనిగడ్డలో మారుమోగాయి. అనంతరం అవనిగడ్డ రాజీవ్ సెంటర్లో విద్యార్థులంతా ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయవంతం చేయడం ద్వారా భారత శాస్త్రవేత్తలు దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యానికేతన్ విద్యార్థులు 500 మీటర్ల జాతీయ పతాకా ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు, డి.ఎస్.పి మురళీధర్, సీఐ లు జి శ్రీనివాస్, బిబి రవికుమార్, వైసీపీ యూత్ లీడర్ సింహాద్రి వికాస్, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంఈఓలు ఎన్ శివశంకర్ రావు, టి రామదాసు, అన్నపరెడ్డి పిచ్చయ్య, ఎస్వీఎల్ క్రాంతి, కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ఎన్ఆర్ఐ వికాస్ ప్రిన్సిపాల్ కే వెంకటేష్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావుతదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ లాండింగ్ అవడంతో చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడంతో ఇందుకు కారకులైన శాస్త్రవేత్తలను అభినందిస్తూ ముస్తాబాద నవభారత్ హై స్కూల్ విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమామ్ మాట్లాడుతూ ప్రపంచంలో చంద్రుని పైకి అడుగుపెట్టిన నాలుగో దేశంగా భారత్ రికార్డు ఎక్కిందని అంతేకాకుండా దక్షిణ ధ్రువం పై అడుగుపెట్టిన ఏకైక దేశంగా భారతదేశం ఖ్యాతి పొందిందని వివరించారు.. ఇంతకుముందు అమెరికా రష్యా చైనా దేశాలు జాబిల్లిపై అడుగుపెట్టాయని తెలియజేశారు. ఈ ర్యాలీలో నేచురోపతి వైద్యులు డాక్టర్ శ్రీధర్ బాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ నానారావు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : చరిత్ర సష్టించిన ఇస్రో, చంద్రుని పై విజయవంతం గా దిగిన విక్రమ్ ల్యాండర్. చంద్రమాన్ -3సెక్సెస్ చేసిన భారతీయ శాస్త్రజ్ఞులకు. స్థానిక శ్రీ సాయి విద్యా నికేతన్ ప్రిన్సిపల్ సింగంశెట్టి ఆదినారాయణ, విద్యార్థులు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ఉంగుటూరు : తేలప్రోలు పరిధిలో అంపాపురంలోని ది కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ వారి మోడల్ డ్రైవింగ్ డ్రైవింగ్ స్కూలులో వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. ఏపీ శాక్స్ కేడీఎల్ ఓఏ ట్రక్కర్స్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 63 మంది డ్రైవర్లకు హెచ్.ఐ.వి. పరీక్షలు, ఉచిత సుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పలువురు ట్రైనీలు పాల్గొని రక్తదానం చేశారు. కాగా సెంటరు ఫర్ సైట్ సహకారంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోడల్ డ్రైవింగు స్కూలు ప్రిన్సిపాల్ కే.ఎస్.రాజారావు, ఏపీ శాక్స్ మేనేజర్ వి.వి. సాంబశివరావు, డాక్టర్ శ్రీ రంజిత, కౌన్సిలర్ జాస్మిన్, ఏ.ఎన్.ఎం. శాంతి కుమారి, ఔట్ రీచ్ ఉద్యోగి ఎం.శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీలో మైలవరం విద్యార్థికి సీటు

ప్రజాశక్తి - మైలవరం : మైలవరానికి చెందిన విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన సెంట్రల్ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్‌లో మైలవరానికి చెందిన టివిఎన్ఎన్ఎస్ లక్ష్మీబాలరామిని ఐఎంఎ లాంగ్వేజ్ సైన్స్ కోర్సులో విద్యను అభ్యసించడానికి అడ్మిషన్ పొందింది. ప్రతిభ ఉత్తీర్ణత ఆధారంగా జరిగిన ఎంపికలు బలరామిని లాంగ్వేజ్ సైన్స్ మెరిట్ లిస్టులో ఎంపికైంది.

కంచికచర్ల గ్రంథాలయాధికారిని సన్మానిస్తున్న పాఠకులు...

గ్రంథాలయాధికారికి సన్మానం

ప్రజాశక్తి - కంచికచర్ల : గ్రంథాలయ నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ జిల్లా కలెక్టర్ నుండి అవార్డు అందుకున్న కంచికచర్ల గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడును గురువారం కంచికచర్ల గ్రంథాలయంలో పాఠకులు ఘనంగా సత్కరించారు. కంచికచర్ల గ్రంథాలయంలో పాఠకులకు అవసరమైన మెటీరియల్ సకాలంలో అందిస్తూ, గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేస్తున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి గ్రంథాలయాధికారి రంగిశెట్టి వెంకటేశ్వర్లు, పాఠకులు సర్వేశ్వరరావు,ఎం పేరయ్య, శ్రీనివాస్, నాగరాణి, అంజలి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ మెప్పుకోసం చంద్రబాబును తిడుతున్నారు: సౌమ్య

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని కాకాని నగర్ మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం నాడు నారా లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వైసీపీ నేతలపై తీవ్ర స్థాయిలో మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య మండిపడ్డారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ కళ్ళల్లో పైశాచిక ఆనందాన్ని చూడటానికి కృష్ణ జిల్లా పరువు తీసిన వంశీ, వెల్లంపల్లి, కొడాలి నాని, పేర్ని నాని,దేవినేని అవినాష్ వీరందరూ చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు.

నందిగామ నుండి తరలి వెళ్లిన పారిశుధ్య కార్మికులు

విజయవాడ తరలి వెళ్లిన కార్మికులు

ప్రజాశక్తి - నందిగామ : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని చలో విజయవాడకు గురువారం నందిగామ మున్సిపల్ కార్యాలయం నుండి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు విజయవాడ తరలి వెళ్లారు. సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్, మున్సిపల్ పారిశుధ్య కార్మికుల నాయకులు నరేష్, సైదా, మాణిక్యము తదితరులు పాల్గొన్నారు.

ఏపి గ్రామ రెవెన్యూ సహాయకుల ఉద్యోగుల సంఘాల

చలో విజయవాడకు అనుమతి లేదు

ఇన్‌చార్జి నగర పోలీసు కమిషనర్ అశోక్‌కుమార్ - నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

ఇన్‌చార్జి పోలీసు కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల ఉద్యోగుల సంఘాల (సి.ఐ.టి.యు.) వారు శుక్రవారం చలో విజయవాడ పేరుతో వివిధ రకాల నిరసన కార్యక్రమాలు విజయవాడ నగరంలో జరపాలని పిలుపు ఇచ్చిన నేపథ్యంలో అటువంటి కార్యక్రమాలకు స్థానిక పోలీస్ అధికారులు, ప్రభుత్వం నుండి ఏ విధమైన అనుమతులు లేవని ఇన్‌చార్జి నగర పోలీసు కమిషనర్ జివిజి అశోక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ నగరంలో సెక్షన్ 144 సిఆర్‌పిసి, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమాల సందర్భంగా విజయవాడ నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే సమాచారం వుందన్నారు. నిబంధనలను అతిక్రమించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల ఉద్యోగులు, వారి మద్దతుదారులు పైన తెలిపిన కార్యక్రమాలలో పాల్గొంటే పోలీస్ వారు తీసుకునే చట్టపరమైన కఠిన చర్యల వలన ఇబ్బందులు పడకుండా జాగ్రత్త పడాలని కోరారు.

26న న్యాయ సేవా శిబిరం

జిల్లా జడ్జి వి.శ్రీనివాసరావు

జిల్లా జడ్జి వి.శ్రీ నివాసరావు

ప్రజాశక్తి- నందిగామ : 26న నందిగామ కమ్మ కళ్యాణ మండపంలో నూతన తరహా న్యాయ సేవల శిబిరం జరుగుతుందని నందిగామ మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, నందిగామ 16వ అదనపు న్యాయస్థానం జిల్లా జడ్జి వి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జడ్జి శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ న్యాయశాఖ, పరిపాలన శాఖ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ ప్రభుత్వ పథకాలను వివిధ శాఖల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల స్కీములు ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కలుగజేయడం దీని ముఖ్య ప్రాధాన్యత అని తెలిపారు. కేంద్ర రాష్ట్ర పథకాల గురించి ప్రజలకు తెలియజేయడం, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ, ఎండిఒ శాఖ, మహిళా శిశు సంరక్షణ శాఖ, వికలాంగుల సంక్షేమ శాఖ, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్, బిసి సంక్షేమం, ఎస్‌సి సంక్షేమం, గిరిజన సంక్షేమం, విద్యాశాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, బ్యాంకులు, బీమా శాఖ, కార్మిక శాఖ, సచివాలయాలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎన్‌జిఒలు, నూతన తరహా న్యాయ సేవలు శిబిరంలో పాల్గొంటారని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ లీగల్ ఎయిడ్ కౌన్సిల్, న్యాయవాదులు అందరూ తప్పక హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు, సబ్ కోర్ట్ జడ్జ్ లక్ష్మీరాజ్యం, ఎ.డిఎం జడ్జిరియాజ్, జిల్లా సూపరింటెండెంట్, పిడిఎం సూపరింటెండెంట్, న్యాయవాదులు ఉచిత న్యాయ సహాయ న్యాయవాది షేక్ ఆజాద్, గుంజి వాసు, నూతక్కి. తారా సింగ్, ముళ్ళపాటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సమగ్రాభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే మల్లాది

30వ డివిజన్‌లో "గడప గడపకు మన ప్రభుత్వం"

పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పక్కన డిప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక 30 వ డివిజన్ 242వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం జరిగింది. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. రామకృష్ణాపురం బుద్ధరాజు వీధిలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరును ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి ఆయా పథకాలను అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. గత తెలుగుదేశం పాలకులు 30వ డివిజన్ అభివృద్ధిపై కనీసం చిత్తశుద్ధి చూపలేదని ఎమ్మెల్యే విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ సమగ్రాభివృద్ధి కోసం నాలుగేళ్లలో రూ. 23 కోట్లు వెచ్చించగా.. కేవలం రోడ్ల నిర్మాణానికే రూ. 9 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వరకు ప్రధాన రహదారిని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఇ రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సిడిఓ జగదీశ్వరి, నాయకులు మర్రి చంద్రమౌళి, గోపిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బుకింగ్ కేంద్రం ప్రారంభం

బుకింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ బాల సరస్వతి

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడిలోని పార్సిల్ ప్రాసెసింగ్ హబ్‌లో బుకింగ్ కేంద్రాన్ని రైల్వే మెయిల్ సర్వీస్ (ఆర్ఎంఎస్) సూపరింటెండెంట్ జి.వి.బాల సరస్వతి గురువారం ప్రారంభించారు. ఈ కౌంటర్‌లో పార్సిల్స్, స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్, బల్క్ బుకింగ్ చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. ఈ కౌంటర్ ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పనిచేస్తుందన్నారు. ఆదివారం, పండుగ సెలవుల్లో కూడా పనిచేస్తుందన్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై మొదలగు ప్రధాన నగరాలకు పార్సిల్స్ వెంటనే డిస్పాచ్ చేసి తరువాతి రోజుకు చేర్చబడతాయన్నారు. కావున వ్యాపారులు, వినియోగదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని జి.వి.బాల సరస్వతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ (హెడ్ క్వార్టర్స్) రైల్వే మెయిల్ సర్వీస్ (ఆర్ఎంఎస్) ముత్యాల శ్రీనివాసు కూడా పాల్గొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి క్రెడిట్ కార్డు విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ ప్రయివేట్ రంగ బ్యాంకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మారియట్ ఇంటర్నేషనల్ అవార్డు గెలుచుకుందని దీనిలో భాగంగానే మోన్‌వాయ్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ క్రెడిట్ కార్డు విడుదల చేసినట్లు డిజిటల్ బ్యాంకింగ్ హెడ్ పరాగ్‌రావు తెలిపారు. నగరంలోని బ్యాంకు శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలను తెలియచేశారు. ఈ క్రెడిట్ కార్డు డిస్కవర్ గ్లోబల్ నెట్‌వర్క్‌లో భాగమైన డైనర్స్ క్లబ్ ద్వారా పనిచేస్తుందన్నారు. ఈ కార్డుతో ట్రావెల్ ప్రత్యేకమైన ప్రోగ్రామ్ ప్రయోజనాలు ఉంటాయన్నారు. రివార్డులు, వేగవంతమైన యాక్సెస్‌ను అందించడం ద్వారా విలువైన కార్డ్ హోల్డర్ల ప్రయాణాలకు సంబంధించి ఎక్కడైనా వినియోగించేలా రూపొందించారని తెలిపారు. కార్డు ద్వారా అన్ని రకాలైన బ్యాంకు కార్యాకలాపాలను ఉపయోగించుకునేలా రూపొందించినట్లు తెలిపారు.

ఎక్స్ఛేంజ్ కార్నివాల్‌ను ప్రారంభించిన స్కోడా ఆటో

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మోడల్ అప్‌డేట్‌లు, కస్టమర్ సర్వీస్ కార్యక్రమాలను కొనసాగిస్తూ, స్కోడా ఆటో ఇండియా ఆగస్టు 2023 ఎక్స్ఛేంజ్ కార్నివాల్‌ను ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి. కే.ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్నివాల్ కొత్త స్కోడా కార్లను సొంతం చేసుకున్న వారి అనుభవాన్ని మరింత మెరుగుపరచడానికి ఉపయోగ పడుతుందని అన్నారు. కస్టమర్-స్నేహపూర్వక ఒప్పందాలు, డిస్కౌంటులు, సర్వీస్, నిర్వహణ, వారంటీ ప్యాకేజీలను కలిగి ఉంది అన్నారు. స్కోడాను కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు విలువను, గొప్ప యాజమాన్య అనుభవాన్ని అందించడమే ఎక్స్ఛేంజ్ కార్నివాల్ లక్ష్య మని తెలిపారు.. ఎక్స్ఛేంజ్ కార్నివాల్ కింద, స్కోడా ఆటో ఇండియా రూ. 60,000 వరకు ప్రయోజనాలను, రూ. 70,000 వరకు కార్పొరేట్ ప్రయోజనాలను అందిస్తోందన్నారు.

అందుబాటులో పశుపోషణ పథకాలు

ప్రజాశక్తి - తిరువూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పశుపోషణ పథకాలన్నీ పాడి రైతులకు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని పశుసంవర్ధక శాఖ విజయవాడ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ వి.గోపీనాథ్ తెలిపారు. తిరువూరు డివిజన్‌లోని గంపలగూడెం, తిరువూరు మండలాల్లోని పశు వైద్యశాలల్లో ఆయన గురువారం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. అనంతరం తిరువూరులోని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో పశువుల డాక్టర్లతో సమావేశం నిర్వహించి రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశీయ పశుజాతి అభివృద్ధి పథకం కింద ఒంగోలు మేలు జాతి గేదెలను సబ్సిడీ రేటుకు ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. పశువుల దాణా 70 శాతం రాయితీకి అందజేస్తున్నామని తెలిపారు. రైతుభరోసా కేంద్రాల్లో పశువుల మందులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సింగ్, డాక్టర్లు శ్వేత, సాయి, అభిలాష్, షీలా, విఎల్ఓ గోపాలకృష్ణ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

- సిఐటియు కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరావు

మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు ప్రభుత్వం దుర్మార్గంగా వాడుకుని వారి సంక్షేమాన్ని నీరుగార్చిందని సిఐటియు కష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరావు అన్నారు. గురువారం స్థానిక జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కొరకు కష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రేడ్ యూనియన్ల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాల వెంకటేశ్వరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి 2019 నుండి ఇసుక పాలసీ నూతన విధానం వలన బిల్డింగ్ కార్మికులకు పనులు లేక అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రధానంగా కుటుంబాన్ని పోషించుకోలేక భార్య, పిల్లలని పస్తులతో ఉంచలేక మనస్తాపానికి గురయ్యారన్నారు. ఈ కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 34 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నరన్నారు . వీరిలో మచిలీపట్నం ప్రాంతానికి సంబంధించిన వ్యక్తి ధూళిపూడి వెంకటేశ్వరావు పనులు దొరకక కుటుంబ పోషణకు తెలంగాణ రాష్ట్రానికి వలస వెళ్ళుతూ ప్రమాదవశాత్తు ట్రైన్ క్రింద పడి చనిపోయడని ఈ విషయం ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా ఫలితం లేదన్నారు. ఆయన కుటుంబానికి ఒక లక్ష రూపాయులు మాత్రమే ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. అదే సంక్షేమ బోర్డు ద్వారా అయితే 5 లక్షల 20 వేలు వచ్చేవన్నారు. బిల్డింగ్ కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేపించుకునేందుకు సిఐటియు ఆధ్వర్యంలో 25 సంవత్సరాల సుధీర్ఘ పోరాటం చేసి సాధించుకోవడం జరిగిందన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.వి. గోపాలరావు మాట్లాడుతూ కరోనా సమయంలో 2020 మరియు 2021 సంవత్సరాల్లో బిల్డింగ్ కార్మికులు పడిన ఇబ్బందుల వల తమ సంక్షేమబోర్డు నుండి తలోక 10వేలు ఇవ్వమని అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చామని, ఆందోళనలు నిర్వహించామని కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయం చెయ్యమని రాష్ట్ర ప్రభుత్వానికి సలహ ఇచ్చిందని కాని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సహాయం చెయ్యలేదన్నారు. నిర్మాణ కార్మికుల కుటుంబాలను అదుకొనేందుకు నిర్మాణదారులు ఇచ్చిన ఒక శాతం నిధితో ఈ సంక్షేమ బోర్డు నిర్వహణ జరుగుతుందని ప్రభుత్వం వాటా ఒక్క రూపాయి కూడా లేదన్నారు. ఈ పరిస్థితిలో వైఎస్ఆర్ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి పెళ్ళి కానుక, డెలివరీ, బెనిఫిట్స్, అంగవైకల్యం పరిహారాలు, హస్పటలైజేషన్, సహజ మరణం, ప్రమాద మరణం, అంత్యక్రియలు లాంటివి వైయస్ఆర్ ప్రభుత్వం ఇవ్వకుండా 1214 మెమో ఇచ్చి నిలుపుదల చేసి కార్మికుల పొట్ట కొడుతుందన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు బండారు శ్రీనివాసరావు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో టిఎన్‌టియుసి నాయకులు పంచ పర్వాల కాశీ విశ్వనాథ్, ఐ సి ఇ యు జనరల్ సెక్రెటరీ జి కిషోర్ కుమార్, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ జై రావు, పెయింటింగ్ రంగం నుండి సాయి, ఎలక్ట్రిషన్ రంగం నుండి అల్తాఫ్,వెంకన్న, రాడ్ బెండింగ్ రంగం నుండి జై పాల్, బిల్లింగ్ తాపీ కాంక్రీట్ ముఠా రంగ నాయకులు భద్రం, నాగరాజు,ఐ ఎన్ టి యు సి,మరియు వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు, సభ్యులు కార్మికులు పాల్గొన్నారు.

26న 'భారతలౌకిక రాజ్యాంగంపై మతోన్మాదుల దాడి'పై సదస్సు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో 'భారతలౌకిక రాజ్యాంగంపై మతోన్మాదుల దాడి పర్యావసనాలు పరిష్కారాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, యద్దనపూడి మధు తెలిపారు. గురువారం అవనిగడ్డలోని ప్రెస్ క్లబ్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 26 ,27 తేదీలలో సిపిఎం పార్టీ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ముఖ్య వక్త గా పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి లౌకిక ప్రజాతంత్ర భారత రాజ్యాంగ పరిరక్షణకై పోరాడుతున్న అందరినీ ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. మోపిదేవి మండల పార్టీ కార్యదర్శి బండి ఆదిశేషు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల అక్కా చెల్లెమ్మలకు ఆర్థిక చేయూతను అందించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైసిపి ప్రభుత్వం నిబద్ధతతో కషి చేస్తుందని ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)లు అన్నారు. గురువారం పాత మున్సిపల్ కార్యాలయ సెంటర్లో మెప్మా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్ పథకం స్టాళ్లను ఎంపీ వల్లభనేని బాలశౌరి,ఎమ్మెల్యే కొడాలి నానిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లలోని ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యులు పూర్తి నాణ్యతతో తయారుచేసి ఆహా క్యాంటీన్లో అందుబాటులో ఉంచిన ఆహార పదార్థాలను ప్రజలు ఒకసారి రుచిచూసి, ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వడ్లాది మురళీకృష్ణ, వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా యువజన విభాగాపు అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : సర్పంచ్

బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-చల్లపల్లి : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమనీ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులతో పాటు యువత అవగాహన కలిగి ఉండాలని చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాములు కష్ణకుమారి, కార్యదర్శి పివి. మాధవేంద్రరావులు తెలిపారు. బాల్య వివాహాలకు వ్యతిరేఖంగా ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు చల్లపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్థానిక నారాయణరావునగర్ లోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల..కళాశాలలో సమావేశం నిర్వహించి బాలికలకు అవగాహన కల్పించారు. యువకునికి 21 సంవత్సరాలు, యువతికి 18 సంవత్సరాలు నిండనిదే వివాహం జరపటం చట్టవిరుద్ధమనీ, నిర్ణీత వయసు రాకుండా వివాహాలు జరిపితే పెండ్లి కుమారుడు, తల్లిదండ్రులతోపాటు సహకరించిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. బాల్యవివాహం చేసుకోవటం ద్వారా యువతి ఎన్నో ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. ఈ విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థినిలు తీసుకోవాలనీ, బాల్యవివాహాలకు అంగీకరించవద్దని సూచించారు. ఈ సమావేశంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శాంతి విశాల, మహిళా పోలీసులు సైకం నాగలక్ష్మి, వేమూరు. లావణ్య, అంగన్వాడీ కార్యకర్త ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు. .

వాలంటీర్ల దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని దోసపాడు ఎలమర్రు సచివాలయం పరిధిలో వాలంటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంట్రుప్రగడ సచివాలయం పరిధిలో రెండు వాలంటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎండిఒ టి.సీతామహాల్క్ష్మీ అన్నారు. ఆయా సచివాలయ పరిధిలోని అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

డెయిరీ ప్రారంభిస్తున్న చలసాని ఆంజనేయులు

విజయ డెయిరీ పార్లర్ ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి : మండలం పరిధిలోని లక్ష్మీపురం శివారు రామానగరంలో కష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన విజయ డెయిరి పార్లర్ కష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా బోర్డు డైరెక్టర్ వేమూరి సాయి వెంకట రమణ, ట్రస్ట్ డైరెక్టర్ గోళ్ళ పూర్ణ మల్లికార్జునరావు, లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు నర్రా సాయిబాబు, చల్లపల్లి సీఐ బీ.భీమేశ్వర రవికుమార్, పరుచూరి కమలాకరరావు, సేల్స్ డి.జి.ఎం డి.లక్ష్మణ, సేల్స్ మేనేజర్ శశిధర్, నిర్వాహకులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంలో శ్రీకాంత్ ముఖ్యభూమిక

శ్రీకాంత్

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : భారత్ అంతరిక్షంలో సంచలనం సష్టించింది. చంద్రయాన్ - 3 ప్రయోగం విజయవంతం అయింది. ప్రయోగంలో ఐదుగురు శాస్త్రవేత్తలు కీలకంగా వ్యవహరించారు. ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ పి వీరముత్తువెల్, డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె కల్పన, డైరెక్టర్ ఆఫ్ యుఆర్ రావు శాటిలైట్ సెంటర్ ఎం శంకరన్, మిషన్ డైరెక్టర్ ఎం శ్రీకాంత్ కీలకంగా వ్యవహరించిన వారిలో ఉన్నారు. అయితే వారిలో చంద్రయాన్-3 మిషన్ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వర్తించిన ఎం శ్రీకాంత్ తెలుగువాడు. అతని స్వస్థలం విశాఖపట్నంలోని సీతమ్మధార. కాగా మచిలీపట్నంలోని నిర్మలా కాన్వెంట్లో పాఠశాల విద్య పూర్తి చేశారు. ఇంటర్, డిగ్రీ ఫస్టియర్ వరకు బందరులో చదువుకుని విశాఖలోని ఏవిఎన్ కళాశాలలో మిగిలిన రెండేళ్ల చదవు డిగ్రీ పూర్తి చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఎమ్మెస్సీ (ఎలక్ట్రికల్), ఇండోర్లో ఎంటెక్ చేసి ఇస్రోలో శాస్త్రవేత్తగా చేరారు. చంద్రయాన్-2కు డిప్యూటీ మిషన్ డైరెక్టరుగా, చంద్రయాన్-3కు మిషన్ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం శ్రీకాంత్ బెంగళూరులో నివాసం ఉంటున్నారు.

శ్రీకాంత్‌కు పలువురి అభినందనలు : బుధవారం యావత్ ప్రపంచాన్నే సంభ్రమాచ్చర్యాలతో ముంచి, భారత్ అధికార ముద్ర అశోక ధర్మచక్రాన్ని చంద్ర మండలంపై తొలిసారిగా ముద్రవేసిన చంద్రాయాణ్ -3 మిషన్ ఆపరేషన్ డైరెక్టర్ ఎం శ్రీకాంత్ స్థానిక నిర్మల హైస్కూల్ విద్యార్థి కావటం రాష్ట్రానికి గర్వకారణం. ఇస్రో చేపట్టిన ప్రతిష్టత్మకమైన అత్యంత కీలకమైన మిషన్ ఆపరేషన్ డైరెక్టర్ శ్రీకాంత్ సేవలకు గురువారం నిర్మల హైస్కూలులో అభినందనలు తెలుపుతూ కేక్ కట్ చేశారు. ఇంతటి ప్రఖ్యాతి తెచ్చిన శ్రీకాంత్ నిర్మలా విద్యార్థి కావటం గర్వించ దగిన విషయమని ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థులు ప్రశాంగించారు.

చంద్రయాన్ -3లో ఉయ్యూరు యువశాస్త్రవేత్త

ప్రజాశక్తి-ఉయ్యూరు : భారత దేశానికి గర్వకారణంగా నిలిచిన చంద్రయాన్ - 3 ప్రయోగంలో ఉయ్యూరుకు చెందిన యువ శాస్త్రవేత్త మధిరి చైతన్య కూడా కీలక భూమిక పోషించారు. శ్రీహరి కోట షార్లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న చైతన్య చంద్రయాన్ - 3 ప్రయోగంలో ఎల్వి ఎం రాకెట్ మొదటి స్టేజి లిఫ్ట్ చేసేందుకు ఓవరాల్ ఇన్చార్జ్ బాధ్యత చేపట్టి విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. స్థానిక ఫ్లోరా స్కూల్లో పదవత రగతి వరకు, ఇంటర్మీడియట్ చైతన్య కళాశాలలో చదివారు. అనంతరం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నోస్ తిరువనంత పురం క్యాంపస్లో ఐఐటీ పూర్తిచేశారు. ఇస్రో స్పాన్సర్షిప్తో చదివి 2012లో సైంటిస్టుగా సీ కేటగిరిలో ఎంపికై ప్రస్తుతం ఈ కేటగిరిలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చైతన్య తండ్రి వెంకటేశ్వరరావు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ ఉయ్యూరు బ్రాంచిలో మేనేజర్గా పనిచేస్తున్నారు. చంద్రయాన్ -3 విజయంలో శాస్త్రవేత్తగా చైతన్య భూమిక పోషించడ పట్ల ఉయ్యూరులో హర్షం ప్రకటిస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

నాణ్యమైన విద్యతోనే భవిష్యత్

ప్రజాశక్తి-చల్లపల్లి : నాణ్యమైన విద్య పొందిన వాళ్లే మంచి భవిష్యత్తు పొందుకుంటారని పలువురు వక్తలు అన్నారు. చల్లపల్లి ఎస్వీఎల్ క్రాంతి జూనియర్ కాలేజీలో గురువారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులైన సిఐ భీమేశ్వర రవికుమార్, చల్లపల్లి జెడ్పిటిసి సభ్యురాలు రాజులపాటి కళ్యాణి ,చల్లపల్లి విజయ క్రాంతి జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ దుట్ట ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ దుట్ట శివరాం ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యాలయాలు దేవాలయాలు లాంటివని కషి పట్టుదలతో విద్యను అభ్యసించాలని అన్నారు. విద్య ద్వారానే వ్యక్తిగతం గాను కుటుంబ పరంగాను సమాజ పరంగాను ఎంతో కీర్తి ప్రతిష్టలు వస్తాయని తెలియజేశారు. అలాంటి నాణ్యమైన విద్యను క్రాంతి జూనియర్ కాలేజ్ అందించడం అభినందనీయమన్నారు. చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా అతిథులు అందరూ కలిసి కేక్ కటింగ్ చేశారు. కళాశాలలో చదువుతూ జాతీయ త్రోబాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జనుముల ప్రబోధ్ కుమార్ ను సిఐ బివి.రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ముందుగా విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, కార్యక్రమాలు ఉత్సాహభరితంగా కొనసాగాయి.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లవల్లికి పూర్వ వైభవం తెస్తాం

• 'యువగళం' పాదయాత్రలో లోకేష్ • కృష్ణాజిల్లాలో ముగిసిన యాత్ర

ప్రజాశక్తి-గన్నవరం

టిడిపి అధికారంలోకి రాగానే మల్లవల్లి పారిశ్రామిక వాడకు పూర్వ వైభవం తీసుకొస్తామని, 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్ర 193వ రోజు గురువారం కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలంలో 12 కిలోమీటర్ల మేర సాగింది. అంపాపురం గ్రామంలో భారీ గజమాలతో లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. వీరవల్లిలో బ్రహ్మణులతో పూర్ణకుంభంతో వేదశీర్వచనాలతో స్వాగతం పలికిన అనంతరం శ్రీ వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి అందజేశారు. అనంతరం లోకేష్ పాదయాత్ర యధావిధిగానే కొనసాగింది. సింగన్నగూడెం, మల్లవల్లి, కొత్త మల్లవల్లి గ్రామాల మీదుగా ఏలూరు జిల్లా మీర్జాపురంలో ఏర్పాటు చేసిన రాత్రి బసకు చేరుకున్నారు. రంగన్నగూడెం, మల్లవల్లి గ్రామాల్లో పలు స్థానిక సమస్యలపై నారా లోకేష్‌కు వినతిపత్రాలు అందించారు. సింగన్నగూడెంలో గౌడ సామాజిక వర్గీయులతో, మల్లవల్లిలో బీసీ కులస్తులతో, కొత్త మల్లవల్లిలో ఆయిల్ ఫామ్ రైతులతో ఆయన భేటీ అయ్యారు. పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్‌ను మాజీ ఇంటిలిజెన్స్ చీఫ్, ఐపిఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వర్లు, నందమూరి రామకృష్ణ కలిశారు. మల్లవల్లిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మల్లవల్లిని నాశనం చేశారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మల్లవల్లిలో 1400 ఎకరాలను కొంత మంది నాయకులు కొట్టేయడానికి ప్రయత్నిస్తే టిడిపి పోరాడిందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత టిడిపి అధికారంలోకి వచ్చాక మల్లవల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి వందలాది పరిశ్రమలను తీసుకురావడం జరిగిందన్నారు. అశోక్ లేలాండ్ వంటి అనేక కంపెనీలను తీసుకువస్తే జగన్ ఆ కంపెనీలను తరిమేస్తున్నాడని విమర్శించారు. నిరుపేదల కోసం టీడీపీ ప్రభుత్వం మల్లవల్లిలో వంద ఎకరాలు కేటాయిస్తే ఆ భూములలో వైసీపీ ప్రభుత్వం ఒక్క ఇంటిని కూడా కట్టలేదన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే రైతులకు గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తామన్నారు. సాగర్ కాలువల ఆధునీకరణతో పాటు చివరి భూములకు కూడా నీరందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల నారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, యార్లగడ్డ వెంకట్రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

మల్లవల్లి సభలో మాట్లాడుతున్న లోకేష్

వీరవల్లి రైల్వే క్రాసింగ్ దగ్గర ఆర్‌ఒబి ఏర్పాటు చేయాలి

రంగన్నగూడెంలో గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి ఆధ్వర్యంలో ప్రజలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వీరవల్లి-వట్టిగుడుపాడు రోడ్డులో విజయవాడ-ఏలూరు సెక్షన్‌లో వీరవల్లి రైల్వే క్రాసింగ్ 332 దగ్గర ప్రజల సౌకర్యార్థం ఆర్‌ఓబిని ఏర్పాటు చేయాలని కోరారు. సింగన్నగూడెం గ్రామంలో ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ నేతృత్వంలో వినతిపత్రాలు ఇచ్చారు.

ఈ పాదయాత్రలో పోలవరం కాలువ దగ్గర భారీ గజమాలతో నారా లోకేష్‌ను సత్కరించారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం పోలవరం నిర్మాణాన్ని తీవ్ర అశ్రద్ధ చేయడాన్ని నిరసిస్తూ పోలవరం కాలువ దగ్గర నారా లోకేష్ సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు.

ఆత్కూరు బాధితులకు భరోసా

2022 మే నెలలో ఆత్కూరు కోపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు రూ.3 కోట్లు గోల్‌మాల్ చేశారు. నష్టపోయిన బాధితుల్లో నలుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 150 కుటుంబాలు బ్యాంకు ఉద్యోగుల నిర్వాకానికి మోసపోయాయి. గ్రామస్తులు చేసిన పోరాట ఫలితంగా కోటి రూపాయలు తిరిగి రాబట్టగలిగాం.. మిగిలిన డబ్బులు ఎన్ని పోరాటాలు చేసినా తిరిగి ఇవ్వడం లేదు... అంటూ బాధితులు నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ ఆత్కూరు కోఆపరేవటివ్ సొసైటీలో డబ్బు కొట్టేసిన దొంగలను జైలుకు పంపి, దోపిడీసొమ్ము రాబట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఆత్కూరు గ్రామంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నీ పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. 2014-19 మధ్య గ్రామంలో సుమారు రూ.80 కోట్ల విలువైన పనులను చేపట్టాం.గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించుకుంటే ప్రస్తుత ప్రభుత్వం సిబ్బందిని ఇవ్వడంలేదని, జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఇండోర్ స్టేడియం కడితే దాన్ని గోడౌన్, ప్రైవేటు కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే అనుచరులు వాడుతున్నారని, ఏలూరు కాలువపై రూ.11 కోట్లతో వంతెన పనులు మొదలుపెడితే ప్రస్తుత ప్రభుత్వం పనులు నిలిపేసిందని, .మూడు అంతస్తుల మోడల్ పోలీసు స్టేషన్ నిర్మాణం చేపడితే వైసీపీ ప్రభుత్వం పనులు మధ్యలో ఆపేసిందని, గ్రామంలో 150 రేషన్ కార్డులు, పెన్షన్లను వైసీపీ ప్రభుత్వం కుంటిసాకులతో రద్దు చేసిందని, ఇంటి పట్టాలు ఎమ్మెల్యే అనుచరులే తీసుకున్నారు తప్ప అర్హులకు ఇవ్వలేదని, సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు.

తేలప్రోలులో జాతీయ రహదారి పక్కన ఓ టీ కొట్టులో టీ తాగి షాపు నిర్వాహకులతో లోకేష్ ముచ్చటించారు. ఈ సందర్భంగా టీ షాపు నిర్వాహకులు ధనరాజు, నాగమణితో మాట్లాడుతూ పెరిగిన గ్యాస్, ముడిసరుకుల ధరలతో వ్యాపారం లాభసాటిగా లేదు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు ఛార్జీలతో బతుకుబండి లాగడం భారంగా ఉంది. భార్యాభర్తలం రోజంతా కష్టపడినా కుటుంబాన్ని నడపడం కష్టంగా మారింది. ధరలను అదుపుచేస్తే మాలాంటి వారికి ఉపశమనంగా ఉంటుందని చెప్పారు. జగనాసురుడి పాలనలో సామాన్య ప్రజలు కడుపునిండా భోజనం, కంటినిండా నిద్రపోయే పరిస్థితులు లేవన్నారు.

హోంగార్డుల సమస్యలపై సిఎంకు లేఖ

పోలీసు శాఖలో ఒక భాగమై, అన్ని రకాల పోలీసు విధులు క్రమశిక్షణతో నిర్వహిస్తూ పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఎం జగన్‌కు గురువారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ లేఖ రాశారు. రాష్ట్రంలోని హోంగార్డుల రోజు వారీ వేతనం రూ.400 మాత్రమే ఉండడంతో వారు పడుతున్న ఆర్థిక ఇబ్బందులు, కష్టాలను గుర్తించి నాటి తెలుగుదేశం ప్రభుత్వం 18.06.2018న జీవో నెం.77 జారీ చేసి రోజు వారీ వేతనాలను రూ.600కు పెంచిందన్నారు. మరోవైపు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోం గార్డులకు రూ.5 లక్షలు మాత్రమే ఉన్న జీవిత బీమాను రూ.30 లక్షలకు పెంచినట్లు తెలిపారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక హోంగార్డుల రోజువారీ వేతనాన్ని కేవలం రూ.110 మాత్రమే పెంచారని పేర్కొన్నారు. 11వ వేతన సవరణ సంఘం కమిషనర్ సూచనల మేరకు హోంగార్డుల వేతనం, ఇతర అలవెన్సుల పెంపుదలపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని, పదవీ విరమణ వయసును 60 సంవత్సరాల నుండి 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ అనంతరం రూ.పది లక్షలు రిటైర్మెంట్ గ్రాట్యుటీ చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

శరవేగంగా స్మృతివనం పనులు : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడలో అంబేద్కర్ స్మృతివనం పనులు శరవేగంగా జరుగుతున్నాయని మున్సిపల్ కమిషనర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్వరాజ్ మైదానంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ స్మతివనం నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సుమారు రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తున్న బిఆర్ అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం పనులు పూర్తి కావచ్చాయని చెప్పారు. నవంబరు 26న విగ్రహాన్ని ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ భాగాలు బిగించడం పూర్తయ్యిందన్నారు. డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. లైటింగ్, గ్రానైట్, పాత్ వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, సుందరీకరణ తదితర పనులను మరింత వేగవంతం చేసి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ‌ఇంజనీర్ నరసింహారావు, జోనల్ మేనేజర్ సీతారాం, డిప్యూటీ జోనల్-మేనేజర్ రహీమ్, ప్రాజెక్టు డైరెక్టర్ పి.వాసుదేవరావు. ప్రాజెక్ట్ మేనేజర్లు కె..కృష్ణమోహన్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

ఫ్లెక్సీల రగడ

శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వైసిపి మద్దతుదారులు చించివేశారు. వైసిపి కవ్వింపు చర్యలకు పాల్పడడంతో పాటు తమ కార్యకర్తలపై హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, గన్నవరం, గుడివాడ టిడిపి ఇన్‌ఛార్జులు యార్లగడ్డ వెంకట్రావు, వెంకటేశ్వరరావు తదితరులు వీరవల్లి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి లిఖితపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. టిడిపి నేతలపై ఫిర్యాదు చేసేందుకు వైసిపి నేతలు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వీరవల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఒకరికొకరు బల ప్రదర్శనకు దిగారు. దాదాపు రెండు గంటల పాటు హైడ్రామా కొనసాగడంతో ఏం జరుగుతుందోననే ఆందోళన నెలకొంది. చివరకు ఎమ్మెల్యే వంశీకి జిల్లా అడిషినల్ ఎస్‌పి శ్రీహరిబాబు నచ్చజెప్పి ఆయనను అక్కడి నుంచి పంపించి వేశారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి కేసులు నమోదు చేస్తామని హనుమాన్ జంక్షన్ సిఐ అల్లు నవీన్ నరసింహమూర్తి తెలిపారు.

విజయవాడలో భారీ వర్షం

ఏకమైన పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. చిన్నపాటి వర్షాలకు సైతం నగరం చిత్తడి చిత్తడిగా మారడానికి ప్రధాన కారణం స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీమ్‌ను మధ్యలోనే మూసివేయడంతో ఆయా ప్రాంతాల్లో నీరు పెద్ద ఎత్తున నిలబడిపోయి ప్రజలు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఇప్పటికయినా డ్రైనేజి వ్యవస్తను మెరుగుపరిచేందుకు సత్వరమే ఆగిపోయిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజి స్కీమ్‌ను పునరుద్ధరించి, అమలు చేసి, పూర్తిస్థాయిలో పనులు జరిగేటట్లు ప్రభుత్వం, విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకోవాలని నగర వాసులు డిమాండ్ చేస్తున్నారు.

నందిగామలో మెగా జాబ్‌మేళా

ఎంఎల్‌సి తెలిపారు. అదేవిధంగా గతంలో కూడా కెవిఆర్ కళాశాలలో జాబ్ మేళా ఏర్పాటు చేశామని, ఆ జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చిందని.. 21 కంపెనీలో జాబ్ మేళాలో పాల్గొనగా 941 మంది రిజిస్ట్రేషన్ చేయించుకొని ఇంటర్వ్యూలకు హాజరు అవ్వగా, దాదాపు 172 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. నేడు కూడా సుమారు 20 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలకు విచ్చేసారని ఎక్కువమంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందే విధంగా కంపెనీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. నిరుద్యోగ యువత అందించిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ప్రతి మెట్టు ఎక్కుతూ అనుకున్న లక్ష్యాలను సాధించాలని, ఉద్యోగం చిన్నదా, పెద్దదా అనే బేధ భావం లేకుండా లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని తెలిపారు.

వైసిపి పాలనలో ఇరిగేషన్ వ్యవస్థ నాశనం : బుద్ధ ప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నాలుగేళ్లలో ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా సర్వనాశనం అయిందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ విమర్శించారు. గురువారం బుద్ధ ప్రసాద్ తన కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం లో వ్యవసాయం అంధకారంలో ఉందన్నారు. దివిసీమ జీవనాధారమైన ఆక్విడెక్టును 1936లో సర్ ఆర్థర్ కాటన్ నిర్మించారని అనంతరం 1977లో మరో తొట్టెను కీర్తిశేషులు మాజీ మంత్రి మండలి వెంకటకష్ణారావు నిర్మించడంతో దివిసీమలో 77 వేల ఎకరాలకు సాగునీరు పర్యాటక కేంద్రంగా కూడా విరాజిల్లుతుందని నేడు అది దయానియస్థితికి చేరుకుందన్నారు. ఆక్రిడేక్ట్ మరమ్మత్తుల కోసం గత ఏడాది 54 లక్షల రూపాయలు మంజూరు కాగా టెండర్ పిలిచి కాంట్రాక్టర్కు పనులు అప్పగించి నప్పటికీ ఆ పనులు చేయకపోవడంతో కాంట్రాక్టర్ పై ఒత్తిడి తీసుకురాకపోగా నియోజక వర్గంలోని డ్రైనేజీల మరమ్మత్తుల పనులన్నీ వారికి అప్పగించారు అన్నారు. దీంతో మరమ్మ తులు జరగక కొద్దిపాటి వర్షానికి పొలాలు ముంపుకు గురవుతున్నాయని తెలిపారు. కేఈబీ కెనాల్ కు 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయవలసి ఉండగా ఇప్పుడు కేవలం 700 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారని, దీనితో సాగు సాగకపోగా నాట్లు వేసిన పంట పొలాలు కూడా ఎండిపో తున్నాయన్నారు. అదే విధంగా

కోడూరు మండలంలో సాగునీరు అందక 4 ఎకరాలు పంటకు నోచుకోలేద న్నారు. కష్ణ నది రెండు పాయలుగా చీలి దివిసీమ ఏర్పడగా ఒకవైపు సముద్రపు కట్ట ఒకవైపు కరకట్ట రక్షణగా నిలుస్తున్నాయని అయితే టీ కొత్తపాలెం ఉల్లిపాలెం ప్రాంతాల్లో కరకట్ట దెబ్బతిందని అయినా నాలుగు సంవత్సరాల నుండి మరమ్మత్తులకు నోచుకోలేదు అన్నారు. ఇటీవల కాలంలో కష్ణానది ప్రవాహం వేగం మారిందని, దీనితో పాత ఎడ్ల లంక నాచుగుంట కోతకు గురవుతున్నాయన్నారు. ఆ గ్రామాలకు నదికి రీవిట్మెంట్ కట్టడం ద్వారా గ్రామాలను దెబ్బ తినకుండా రక్షించుకోవాలని తెలిపారు. ఇప్పటికీ రహదారి సౌకర్యం లేని ఎడ్ల లంకకు బ్రిడ్జి కట్టిస్తాం అంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు తప్ప ఇంతవరకు పరిష్కారం చూపలేదు అన్నారు. అదేవిధంగా రైతుల విషయంలో కూడా గత ఖరీఫ్ పంటను అమ్ముకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారని ఆఫ్ లైన్లో అమ్ముకుంటే ఆన్లైన్ చేసి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రజా ప్రతినిధులు అధికారులు చివరకు ప్రైవేట్ వ్యాపారస్తుల దగ్గర అమ్ముకునే విధంగా చేశారని, ప్రకతి వైపరీత్యాలు వల్ల నష్టపోయిన రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకు వెళ్లేందుకు రైతు పోరుబాట దీక్షకు పిలుపునిచ్చినట్లు బుద్ధ ప్రసాద్ చెప్పారు. వుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద చేపట్టబోయే దీక్షను విజయవంతం చేయాలని బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం కప్పల దొడ్డి అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో గురువారం మచిలీపట్నంలో సహాయ కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 22 తారీఖున గ్యాస్ లీకేజీతో కప్పలదొడ్డి గ్రామానికి చెందిన మేక ఆంజనేయులు, కోటా సూరిబాబు, మేక సీతారామమ్మ, కోటా సీతమ్మలకు చెందిన నాలుగు ఇల్లు పూర్తిగా కాలిపోయి సుమారు నాలుగున్నర లక్షల పైగా ఆస్తి నష్టం సంబంధించింది. అగ్నిప్రమాదం విషయాన్ని జాతీయ క్రీడాకారుడు ప్రభు ద్వారా తెలుసుకున్న లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ కన్వీనర్,అడ్వకేట్ లంకిశెట్టి బాలాజీ, 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ గురువారం బాధిత కుటుంబాలకు సుమారు 20 వేల రూపాయలు ఖరీదు చేసే వంట సామాగ్రి, బట్టలు, బియ్యం, నిత్యవసర వస్తువులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. విశ్రాంత వి.ఆర్.ఓ లంకిశెట్టి సాయిబాబు బాధిత కుటుంబాలకు 6,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎల్ఐసి ఏజెంట్ చలువాది కోటేశ్వరరావు నాలుగు కుటుంబాలకు దుస్తులు అందజేశారు.ప్రమాద బాధిత కుటుంబాలకు తక్షణమే ప్రభుత్వ పరంగా ఆదుకో వాలని బాలాజీ కోరారు. 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకెశెట్టి వనజ, సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఎల్. ఎన్. ఎస్ .శ్రావణి, మాదిరెడ్డి అంజి బాబు, జాతీయ క్రీడాకారుడు ప్రభు, కొమరిపాలెం శ్రీని వాసరావు, న్యాయవాది జొన్నలగడ్డ వెంకట నాగరాజు పాల్గొన్నారు.

మైత్రీ ఫౌండేషన్ సాయం

అగ్నిప్రమాద బాధితులను మచిలీపట్నం మైత్రీ ఫౌండేషన్ సభ్యులు గురువారం పరామర్శించి వారికి సుమారు 25,000 విలువ గల బియ్యం, నిత్యావసర సరుకుల వితరణ చేశారు. .ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ కుటుంబ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సామూహిక సత్యాగ్రహానికి తరలిరావాలి

ప్రజాశక్తి-కోడూరు : దివిసీమ రైతాంగం ఎదుర్కొం టున్న ప్రధాన సమస్యలపై శుక్రవారం మధ్యాహ్నం పులిగడ్డ అక్విడెక్ట్ ప్రక్కన రహదారిపై జరిగే సామూహిక సత్యాగ్రహానికి కోడూరు మండలం నుంచి భారీ ఎత్తున తరలిరావాలని కోడూరు మండల పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కోడూరు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన పాత్రికేయులు సమావేశంలో బండే శ్రీనివాసరావు మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం లోని రైతుల శ్రేయస్సు కోసం మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ చేపట్టిన ఈ సత్యాగ్రహం దీక్షకు రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కోడూరు మండలం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణంలో దశాబ్దాలుగా పరిష్కారం కానీ సమస్యలకు కేంద్ర ప్రభుత్వ నిధులతో, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. గురువారం సాయంత్రం గుడివాడ గౌరీ శంకరపురంలో రూ.కోటి 20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న ఆరు రోడ్ల జంక్షన్, కార్ల స్టాండ్ వరకు రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కొడాలి నానితో కలిసి ఎంపీ బాలశౌరి భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలనే కాక, గుడివాడలో దశాబ్దాలుగా అపరిస్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించా మన్నారు. ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ అధికారంలో ఉన్నన్ని రోజులు కళ్ళు మూసుకున్న ప్రతిపక్షాలు, వైసిపి హయాంలో కోట్లాది రూపాయలతో అభివద్ధి పనులు జరుగుతున్న కుంటు సాకులను కారణంగా చూపించి రాద్ధాంతం చేసే దారుణ స్థితికి పడిపోయాయని విమర్శించారు. పట్టణంలోని శివారు కాలనీల అభివద్ధికి రూపొందించిన ప్రత్యేక ప్రణాళికలను అతి త్వరలో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా యువజన విభాగా అధ్యక్షుడు మెరుగు మాల కాళీ, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, మహిళా సంఘం అధ్యక్షురాలు మాదాసు వెంకటలక్ష్మి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు 'నిరుద్యోగం - పరిష్కార మార్గాలు'లపై జాతీయ సదస్సు

మచిలీపట్నంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడిగడపలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : రోజూ రోజుకు పెరుగుతున్న నిరుద్యోగం సమస్యపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై 'నిరుద్యోగం - పరిష్కార మార్గాలు' అనే అంశం పై ఈనెల 25 న విజయవాడ లో జాతీయ సదస్సు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో సదస్సు నిర్వహణ జరుగుతుందని ఈ సదస్సుకు ప్రతి ఒక్క నిరుద్యోగి పాల్గొని జయప్రదం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య కష్ణ జిల్లా కన్వీనర్ బాజీ బాబు తెల్లాకుల , జిల్లా కమిటీ సభ్యులు శ్రీను ,కీర్తి పిలుపునిచ్చారు. స్థానిక జ్యోతిబా పూలే విజ్ఞాన కేంద్రంలో బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడం లో అటు కేంద్రం,ఇటు రాష్ట్ర ప్రభుత్వం రెండు విఫలం చెందాయి అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటు గద్దలు అయిన అదానీ,అంబానీ లకు దొచిపెడుతున్నారన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాదయాత్రలో ఊరూరా తిరుగుతూ అధికారంలోకి ఖాళీ పోస్టులు భర్తీ చేస్తానని ఇంతవరకు ఏ పోస్టునూ భర్తీ చేయలేదన్నారు. కేవలం వాలంటీర్ల పోస్టుతోనే సరిపెట్టి ఇవే ఉద్యోగాలని యువతను మభ్యపెడుతున్నరాన్నారు. విజయవాడలో జరిగే సదస్సులో నిరుద్యోగ యువతీ యువకులు మేధా వులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పెనమలూరు : నిరుద్యోగం - పరిష్కార మార్గాలు అనే అంశం పై ఈనెల 25 న విజయవాడలో జరిగే జాతీయ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కష్ణ జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ అన్నారు. తాడిగడప సిఐటియు కార్యాలయంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు రాజ్యసభ సభ్యులు, డివైఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షులు రహీం గారు, శాసనమండలి సభ్యులు ఐ.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వి సోమశేఖర్ ,సిహెచ్ కార్తీక్ ,టి లావణ్య ,సిహెచ్ నాగ దుర్గాప్రసాద్. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే కాన్పులకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే గర్భిణీ స్త్రీల డెలివరీలు జరిగేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో సుస్థిర అభివద్ధి లక్ష్యాలు, హెల్త్, శిశు మహిళా సంక్షేమం, జగనన్నకు చెబుదాం, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, పాఠశాల విద్య, నాడు నేడు రెండవ దశ పనులు, గడపగడపకు మన ప్రభుత్వం పనులు తదితర అంశాల పురోగతిపై ఆయన జిల్లాల వారీగా సమీక్షించారు. కష్ణాజిల్లాలో 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీ హెచ్ సీ) ఉన్నప్పటికీ కేవలం జూలై నెల వరకు కేవలం 56 డెలివరీలు మాత్రమే జరిగాయని దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్కు సూచించారు. సమస్యాత్మకం కానీ డెలివరీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనే జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, తీవ్రమైన కేసులను మాత్రమే ఏరియా ఆసుపత్రి లేదా జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధిక ప్రమాదం గర్భిణీ స్త్రీల ప్రసూతి మరణాలు సంభవించకుండా తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ను సక్రమంగా వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు. రక్తహీనతతో బాధపడుతున్న కిశోర బాలికలు, గర్భిణీ స్త్రీలకు క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలతో పాటు పోషకాహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, అందుకు సంబంధిత అధికారులకు నిత్యం ఆదేశాలు ఇచ్చి పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వీడియోకాన్ఫరెన్స్ లో వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ తో పాటు పాల్గొన్నారు.

పూల ధరలకు రెక్కలు

ప్రజాశక్తి - మొవ్వ : వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పళ్ళు పూలు ధరలు సామాన్యునికి స్థాయికి చేరాయి. శ్రావణమాసంలో రెండో శుక్రవారం నిర్వ హించే వరలక్ష్మి వ్రతాలకు అవసరమైన చామంతి పూలు కిలో రూ.600లకు చేరింది. అరటి పండ్లు ఒకమాదిరి సైజు డజను రూ,.60లు, తమలపాకులు కట్ట రూ.60లుగా ధర పలుకుతోంది. ఒకవైపు వివాహాది శుభకార్యాల సీజన్ మరొకవైపు హిందూ సంప్రదాయంగా నోచుకునే వరలక్ష్మి వ్రతాలు అధికంగా ఉండటంతో కొనుగోలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ కార్యక్రమానికి అవి ప్రధాన పాత్ర పోషించడంతో అవసరానికి సరిపడా మాత్రమే కొనుగోలు చేసి కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

జాతీయ షూటింగ్ పోటీలకు ఎంపిక

హనుమాన్ జంక్షన్ : హనుమాన్ జంక్షన్‌కు చెందిన చింతా లక్ష్మీ రాఘవన్ , మేఘనా దీప్తి కుమా రుడు చింతా రేవంత్ సాయి సందేష్ జాతీయ స్థాయిలో షూటింగ్ పోటీలకు ఎంపిక య్యాడు. రేవంత్ సాయి విజయవాడ గుణదలలోని ఆంబిటస్ వరల్డ్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆగస్ట్ 17 నుండి 22 వరకు కేరళా రాష్ట్రం లోని తిరువనంతపురం జరిగిన సౌత్ జోన్ షూటింగ్ పోటీల లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తమ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామని స్కూల్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అభిషేక్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ సాయిని పలువురు అభినందిస్తున్నారు.

జిల్లా కారాగారంలో పోస్టుల భర్తీకి
దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లా కారాగారంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని జిల్లా కారాగారంలో ఖాళీగా ఉన్న మేల్ నర్సింగ్ ఆర్డేర్లీ డ్రైవర్ ఎలక్ట్రీషియన్ స్వీపర్ పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. మేల్ నర్సింగ్, స్వీపర్ పోస్టులకు నెలకు రూ.12 వేలు, డ్రైవర్, ఎలక్ట్రీషియన్ పోస్టులకు నెలకు రూ.15 వేలు నెలసరి వేతనంగా చెల్లించ న్నుట్లు తెలిపారు. సదరు ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ దరఖాస్తు ఫారం, జత చేయవలసిన ధ్రువపత్రాల ఇతర వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు నిబంధనల ప్రకారం పూర్తిచేసిన దరఖాస్తులను హంసా పాల్ జిల్లా కారాగారం పర్యవేక్షణాధికారి విజయవాడ వారి కార్యాలయంలో 25వ తేదీ నుండి సెప్టెంబర్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలన్నారు. గడువు తేదీ ముగిసిన అనంతరం ఎటువంటి దరఖాస్తులు స్వీకరించ బడవని తెలిపారు. ఆసక్తి కలిగి అర్హత ఉన్న అభ్యర్థులు పైన తెలిపిన పోస్టులకు దరఖాస్తులను చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ ప్రకటనలో కోరారు.

మాట్లాడుతున్న చిత్ర హీరో హీరోయిన్లు

విజయవాడలో
'ప్రేమ దేశపు యువరాణి'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలో ప్రేమ దేశపు యువరాణి చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా బందర్ రోడ్డు లోని ఒక హెూటల్లో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హీరో యమిన్‌రాజ్ మాట్లాడుతూ ఒక అందమైన ప్రేమ కథను ప్రేక్షకులకు సరికొత్తగా ఈ చిత్రం ద్వారా చూపించనున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయి గ్రామీణ నేపథ్యంగా ఈ చిత్రాన్ని చిత్రీకరించినట్లు తెలిపారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ రెండవ తేదీన ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చెప్పారు. తాను విజయవాడలో పుట్టి పెరిగానని సినిమాలంటే ఎంతో ఇష్టమని, యాక్టింగ్ నేర్చుకుని ప్రేమదేశపు యువరాణి చిత్రంతో నటుడిగా వెండితెరకు పరిచయం అవుతున్నానని చెప్పారు. విజయవాడ నుంచి తమ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. విజయవాడ ప్రేక్షకులకు సినిమా నచ్చితే ప్రేక్షకులందరికీ కచ్చితంగా నచ్చుతుందని భావన అందరిలో ఉందని పేర్కొన్నారు. దర్శకుడు సాయి ప్రతి సన్నివేశాన్ని ఎంతో చక్కగా తీశారని ప్రేక్షకులు ఈ చిత్రాన్ని తప్పక ఆదరించాలని ఆయన కోరారు. తదనంతరం హీరోయిన్ ప్రియాంక రెవిరీ మాట్లాడుతూ తాను నటించినా తొలి చిత్రం ప్రేమజేషకు ప్రేమదేశపు యువరాణి చిత్రంలో ఒక అందమైన యువతి పాత్రలో నటించానని తన పాత్ర అందరికీ నచ్చుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు ప్రేక్షకులు చిన్న చిత్రాలను తప్పక ఆదరించాలని ఆమె కోరారు. అనంతరం దర్శకుడు నిమ్మల సాయిసునీల్ మాట్లాడుతూ గ్రామీణ వాతావరణంలో ఈ చిత్రాన్ని తీశానని ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు ఆకట్టుకునేలా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే మూడు పాటలు రిలీజ్ చేశామని, పాటలకు విశేష స్పందన లభిస్తోందని అన్నారు. ఈ చిత్రంలో నటించిన నటీనటులందరూ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షతోనే పనిచేశారని తెలిపారు. విలేకరుల సమావేశంలో నటులు రాజా రెడ్డి,పవన్ పాల్గొన్నారు.

కొండపల్లి బొమ్మ కళాకారుల సొసైటీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం:. కేంద్ర ప్రభుత్వం "స్ఫూర్తి పథకం, ఎంపి లాడ్స్" సంయుక్తంగా 2కోట్ల 29 లక్షల 50 వేల నిధులతో నిర్మించిన కొండపల్లి బొమ్మల తయారీ, విక్రయ భవనసముదాన్ని విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని), జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కలిసి సంయుక్తంగా గురువారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బొమ్మల తయారు చేసే వారికి టూల్ కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని, కలెక్టర్ డిల్లీరావు మాట్లాడారు. సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల జాతీయ సంస్థ (ఎన్ఐ - ఎమ్మెస్ ఎమ్ఇ) ఆధ్వర్యంలోని నిపుణులు కొండపల్లి కళాకారుల నైపుణ్యాన్ని నిపుణుల ఆధ్వర్యంలో ఆధునిక పద్ధతులను నేర్పించడంతో పాటు కొత్తదనాన్ని జోడించి నైపుణ్యాభివద్ధి చేయనున్నట్లు తెలిపారు. మార్కెటింగ్ సదుపాయాల పట్ల కూడా ఈ సంస్థ ఎన్ఐ - ఎమ్మెస్ఎమ్ఇ కళాకారులకు దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ.172.50 లక్షలు కేటాయించిందని, ఈ పథకం నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం 90 శాతం, బొమ్మల కళాకారులు 10 శాతం ఆర్థికంగా భాగస్వామ్యం కావాల్సివుందని అన్నారు. అయితే బొమ్మల కళాకారుల ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఎంపి నిధుల నుండి రూ.29.50 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. బిల్డింగ్ నిర్మాణానికి అదనంగా నిధులు అవసరమై ఉన్న సమయంలో కళాకారులు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురాగా ఈ మేరకు స్పందించి రూ.25.50 లక్షలు ఎంపి నిధుల నుండి మంజూరు చేసినట్లు తెలిపారు.

సొసైటీ భవనం ప్రారంభించిన ఎంపి కేశినేని కలెక్టర్ డిల్లీరావు

నేడు డయల్ యువర్ సిపి

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్.టి.ఆర్. జిల్లా ఇన్ చార్జ్ పోలీస్ కమీషనర్ జి.వి.జి.అశోక్ కుమార్ నేరుగా ప్రజలు మాట్లాడేందుకు శుక్రవారం "డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమం" శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించ బడుతుందని నగర పోలీసు కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమీషనర్ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన 0866-2490613 నెంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు తమ సమస్యలును నేరుగా పోలీస్ కమీషనర్‌కు తెలియచేసి పరిష్కరించుకోవాలని కోరారు. ఎన్.టి.ఆర్.జిల్లాలో జరిగే పోలీస్ సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు, ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు సమాచారం అందించాలనుకునే వారు సోషల్ మీడియా లింకులు ద్వారా చేయవచ్చని అన్నారు.

మిస్టర్ ప్రెగ్నెంట్ చిత్రానికి మహిళల ఆదరణ
విజయవాడలో చిత్ర బృందం విజయోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మిస్టర్ ప్రెగ్నెంట్ చిత్రాన్ని ప్రేక్షకులు, ముఖ్యంగా మహిళా ప్రేక్షకులు ఎంతో ఆదరిస్తున్నారని ఆ చిత్ర హీరో సోహెల్ అన్నారు. మహిళలు 9 నెలలపాటు గర్భం ధరించినప్పుడు పడే బాధని ఈ చిత్రం ద్వారా తెలియచేశామని చెప్పారు. మంచి సినిమాలను విజయవాడ ప్రేక్షకులు ఎప్పుడు ఆదరిస్తారని ఈ చిత్రంతో మరోసారి రుజువైందని ఆయన వెల్లడించారు. మిస్టర్ ప్రెగ్నెంట్ చిత్ర బందం విజయవాడలో సందడి చేసింది. చిత్రం విజయోత్సవంలో భాగంగా గవర్నర్‌పేటలోని ఒక హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో సోహెల్, దర్శకుడు శ్రీనివాస్ వింజనంపాటి విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సోహెల్ మాట్లాడుతూ ప్రెగ్నెంట్ చిత్రానికి ప్రేక్షకుల నుండి విశేష స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు 9 నెలలపాటు గర్భం ధరించినప్పుడు పడే బాధని ఈ చిత్రం ద్వారా తెలియచేశామని ప్రేక్షకులు ఎంతగానో ఈ చిత్రాన్ని ఆదరిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా మహిళా ప్రేక్షకులు ఆదరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విడుదలైన అన్ని సెంటర్లలో మంచి స్పందన లభించిందన్నారు. త్వరలో బూత్ కట్ బాలరాజు చిత్రంతో నేను ప్రేక్షకులు ముందుకి రానున్నట్లు తెలిపారు. విలన్ పాత్రలను సైతం చేయడానికి తాను సిద్ధంగా వున్నానని స్పష్టం చేశారు. అనంతరం దర్శకుడు శ్రీనివాస్ వింజనంపాటి, నిర్మాత అప్పిరెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రాన్ని విజయవాడ ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారని చెప్పారు. ఒక గొప్పదైన కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చామని పేర్కొన్నారు. ఛాలెంజింగ్ క్యారెక్టర్‌లో సోహెల్ అద్భుతంగా నటించారని వారు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో నిర్మాత అప్పిరెడ్డి, నటుడు మబ్బుల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిత్ర హీరో సోహెల్

చంద్రయాన్-3 విజయోత్సాహం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రపంచ దేశాలలో భారత అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞాన శక్తిని చాటిన శాస్త్రవేత్తలను ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని విజ్ఞాన విహార ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యా విషయక సలహాదారు పి. సూర్యనారాయణమూర్తి అన్నారు. భారత అంతరిక్ష సంస్థ చంద్రునిపై ఉన్న వాతావరణ పరిస్థితులపై పరిశోధించేందుకు చేపట్టిన చంద్రయాన్-3 ప్రాజెక్టు విజయవంతం కావడాన్ని పురస్కరించుకొని ఎనికేపాడు విజ్ఞాన విహార పాఠశాల విద్యార్థులు గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా భారత్ మాతాకు జై, జయహో భారత్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. సీతామహాలక్ష్మి, ఉప ప్రధానో పాధ్యాయురాలు జి. శైలజ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సహా విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వన్‌టౌన్ : పాతబస్తీ, వించిపేట నైజాంగేట్ సెంటర్లోని ఎస్‌విఆర్ మెమోరియల్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలను చేబూని పురవీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రెసి డెంట్, రిటైర్డ్ ఆర్మీ వింగ్ కమాండర్ రాజు అరుణ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పిళ్ళా విజయలక్ష్మి స్కూల్ కరెస్పాండెంట్ సారేపల్లి శరత్ బాబు, డైరెక్టర్ రమేష్‌బాబు, ఆర్గనైజర్ సురేష్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: గండ్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, విజ్ఞాన్ విద్యాసంస్థలు, శ్రీ చైతన్య పాఠశాలలో విజయోత్సవాలు నిర్వహించారు. జాతీయ జెండాను చేతబూని గ్రామాల్లోని పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. విజ్ఞాన్ పాఠశాలలో విద్యార్థులు జై భారత్, చంద్రాయన్ 3 అనే అక్షరాకృతితో విద్యార్థులతో విజయోత్సాహాన్ని తెలిపారు. పాఠశాల కరెస్పాండెంట్ తన్నీరు సుధారాణి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీ చైతన్య పాఠశాల స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా జయహో భారత్ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు లావణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఎస్సై రామారావు, పాఠశాల డీన్ వి.కష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం : మండలంలోని వెల్వడం ఎంపిపి పాఠశాలలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ చక్కగా చదువుకొని రాబోవు రోజుల్లో ప్రతి ఒక్కరు అబ్దుల్ కలాం, కల్పనా చావ్లా లాగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరు : ఎ.కొండూరు మండలం, పోలిశెట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'చంద్రయాన్-3 విజయవంతం గురించి చర్చించి క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు జి.రామయ్య, ఎన్.వెంకటేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, బి.సూర్య, బి.శ్రీరాములు, జి.ఇందిర ప్రియదర్శిని, పి.సుధాకరరావు, వై.రవికాంత్, సయ్యద్ ఖలీల్ బాష, బి.ప్రసాద్, కష్ణకు మారి పాల్గొన్నారు.

పాతబస్తీలో విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ

విజయోత్సవ సంబరాల్లో విజ్ఞాన విహార పాఠశాల విద్యార్థులు

జగ్గయ్యపేటలోని విజ్ఞాన్ విద్యాసంస్థల విద్యార్థులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.